

# గుణాంతరం

## – నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

"**నాకు మీ ప్రతి ఉపన్యాసానంతరం** దర్శన భాగ్యం ప్రసాదించమని వేడుకుంటున్నా. నేను మీ దగ్గిరనుంచీ సిరీ సంపదల గురించి రాను, అడగను. అడిగిన మరుక్షణం నా మెడమీద సదాజపులవారు ఎడమచేయి వేసి గెంటెయ్య వచ్చు. వచ్చి, పదాల పరిమితి లేని ఒకే వాక్యం పలుకుతాను. మీరు ఇష్టమైతే సమాధానం ఇవ్వవచ్చు; కష్టమైతే మానెయ్యవచ్చు. మీ పలుకే వజ్రం, వైఢూర్యము. మీ పాదుకలు ముద్దాడి వెళ్ళిపోతాను."

"ఈ సారికి దర్శనం అయింది కదా, మీరు శలవు తీసుకోండి. తరువాత వీలునుబట్టి నేను మీకు అనుమతి ఇస్తుంటాను," అన్నాడుతన పాదుకలను ముందుకు తోసి.

వాటిని ముద్దాడి ఆమె ఆమె వెనుదిరిగి పోవడం క్షణంపాటు చూశాడు. ఆమె ఎవరో ఆయన తెలుసుకున్నాడు. కాస్త విచారించాడు – తన దౌర్బల్యానికి, తన మనసులో మెదిలే వ్యూహానికి.

వారం తరువాత ఆయన మతం మీద ఉపన్యాసం ఇచ్చాడు:

మతం గురించీ నాకు తోచిన కొన్ని విషయాలు చెబుతాను. ఈ చెవ్వుతో విని రెండో చెవ్వుతో ఒదిలేయవచ్చు; లేక ఒక చెవ్వుతో విని రెండో దానినుంచీ వదలకుండా బుర్రలోనే ఉండనీయవచ్చు. మీ ఇష్టం. మతం అనగానే రెండు జాడ్యాలు గుర్తుకొస్తాయి; మూఢనమ్మకాలు, అసహిష్ణత.

ఒక మతస్థాపకుడు తనకు విరుద్ధంగా ప్రవర్తించిన 25,000 మందిని తన సైనికులతో చంపించాడు. దేశ సరిహద్దులను, దేశ ఆస్తిపాస్తులను కాపాడుకోడానికి సైన్యం అవసరమయినట్టు మతాన్ని 'రక్షించుకోడానికి' సైన్యం అవసరం. మతాన్ని కాపాడుకోడానికి ఇంద్రజాలవిద్య, సైన్యం, దుర్మార్గం, మోసం అవసరం. మతాలకు పునాది రాజకీయాలే. రాజకీయాలు సమకూర్చే శక్తి, అధికారం లాంటివి మతం ద్వారా అనుభవించిన మహనీయులు కలరు.

మనిషికి మంచి అవసరమే కాదు, చెడు అవసరం కూడా ఉంది. ఆ రెండింటినీ మతం దానిదంటూ దానిపాళ్ళలో చేకూర్చుతుంది. మనిషి స్వేచ్ఛను తానంతట తానే కోల్పోయాడు. మతం, కులం, జాతీయత, ఆర్థికస్థాయి, నైతిక వ్యవస్థ వగైరాలు స్వేచ్ఛను అరికడతాయి. సంఘం అరాచకంగా మారకుండా ఉండటానికి స్వేచ్ఛ పరిమితి అవసరమేమో! ఒకరి వ్యక్తిగత స్వేచ్ఛ మరొకరి వ్యక్తిగత స్వేచ్ఛ మీద దురాక్రమణచేయకుండా ఉండాలంటే స్వేచ్ఛకూ సంకెళ్ళ అవసరం పడింది. ప్రతి వ్యక్తికీ తన మతంతో ఏదో ఒక అసంతృప్తి ఉండకపోదు. మిగతా మతాలపట్ల కల ద్వేషం ఆ అసంతృప్తిని కప్పి ఉంచుతుంది. కొత్తది ఒక వింతగానే కాక; పాతది ఒక రోతగా అనిపించినపుడు లేక పాతదాని నుంచి ఆశించిన ఫలితాలు లభ్యం కానపుడు కనీసం ఒక ఇతరమతం పట్ల ద్వేషం లేకుండా ఉంటె కొత్తదనాన్ని కోరే మనిషి మతం మారతాడు. ఆ మతపు కొత్త వేషం సరదాకలిగిస్తుంది కూడా. మతమార్పిడీలో లౌకిక లబ్ది ఏదన్నా చేకూరుతుందన్నపుడు ఆ వ్యక్తి మరీ సంతోహంగా, అది ఒక చేయిజార్చుకోగూడని అవకాశంగా భావిస్తూ కొత్త బందిలదొడ్డిని చేరతాడు.

మతం అనే వ్యవస్థ మొలవడానికి భయం, మందమనస్తత్వాల తోపాటు చుట్టూవున్న ప్రకృతి కలిగించే అచ్చెరువు, కుతూహలము కారణాలుగనుక మతం మొలకలు కనీసం లక్ష సంవత్సరాలక్రితమే ఉన్నాయని కొందరు సామాజికవేత్తలు అభిప్రాయపడ్డారు. అంటే దేవుడు అన్న భావన లక్ష సంవత్సరాలనాటిదని భావించవచ్చు. చచ్చినవాళ్లను పూడ్చిపెట్టటం దానికి ఆధారం. శవంతోపాటు కొన్ని పదార్థాలు ఆ శవం గురించీ పూడ్చిపెట్టేవారట. లక్ష సంవత్సరాల వయసుగల మతవృక్షం వేళ్ళు పాతాళంలోకి, కొమ్మలు ఆకాశంలోకి ఎదిగి ఉంటాయి. పైన దేవుడుంటే అక్కడికి కొమ్మలు చేరి ఉండాలి. పైన కాక పాతాళంలో దేవుడుంటే వేళ్ళు అక్కడికి చేరి ఉంటాయి. మామూలు వృక్షాన్ని ఎంతబలమైనదైనా తెగనరక వచ్చు. మతవృక్షాన్ని నిర్మూలించే సాధనం లేదు యావత్తు మానవ జాతి నిర్మూలించబడితే తప్ప. మతాలు మరో భయాన్నీ మనిషికి కలిగించాయి; అదే పునర్జన్మించడం. అందువలన మనిషి లౌకిక విషయాల గురించీ బాధపడటమే కాక, పునర్జన్మగురించీ బెంగకు లోనవ్వలిసి వస్తోంది. బుద్ధుడికి దేముడున్నాడోలేదో తెలియదుగాని, పునర్జన్మ ఉన్నట్టు తెలుసట!

మానవుడి నుంచీ విడదీయలేని నాలుగు అంశాలు పుట్టుక, జీవనం, చావు, దేవుడు లేక మతం. అవి తెలుసుకోలేని రహస్యాలు. వాటికి సంబంధించిన ఊహలు అంతంలేనివి. మానవుడి తొలి దినాలలో ప్రకృతి పెద్ద రహస్యంగా తోచింది, అది భయపెట్టింది కూడా. భయం మనిషి మెదడుకు పనిపెట్టి "సృష్టికర్తను", మతాన్ని సృష్టించింది. మతం పారభౌతిక అంశాలను ఊహించే సాధనంగా ఉపయోగపడింది, మతాలూ మనుషులమధ్య ఉక్కు గోడలయ్యాయి, పోటీ తత్త్వానికి దారిదీశాయి. పోటీ స్పర్ధకు దారితీస్తుంది. కక్షలకూ కార్పణ్యాలకు మతాలూ మాతృభూములయ్యాయి. వాటన్నిటిలో అంతర్ ప్రవంతిలా, సూత్రంలా దేముడు అన్న విషయం ఉండి తీరుతుంది. నాస్తికత్వం మతం క్రింద పరిగణింపబడదు; ఒక అపనమ్మకంగా ఆగిపోతుంది, రంధ్రాన్వేషణ చేస్తూమతాన్ని ఎద్దేవా చేయడం మాత్రమే దాని కార్యకలాపం. దేవుడిగా భావించబడినవాడి లేక మనిషిచేత సృష్టించబడిన వాడిచుట్టూ సాలెగూడులా అల్లుకునేది మతం. ఉన్నాడో లేదో తెలియని

దేవుడనే సాలెపురుగు నుంచీ వచ్చినది కాదు ఆ గూడు. ఉనికిరహితమైన సాలెపురుగు, గూడూ మనిషి సొంతం అనుకుంటే అలా అన్నవాడిని కొరతవెయ్యక్కరలా. దేవుడు కూడా పారిపోకుండా మనిషే అల్లినదది. ఏ అయస్కాంతం ఎవరిని ఆకర్షించగలిగితే అటుపక్క మనుషులు మందలుగా చేరారు. ఇప్పుడు అది మనిషిని గుర్తించడానికి ఒక అంశంగా ఉపయోగపడుతుంది. ఆయా బృందాలు సైన్యాలుగా చీలిపోయాయి. మతాలూ సంస్కృతీ, నాగరికతల స్వభావాలనే మార్చివేశాయి. దుర్మార్గులచేత దండయాత్రలు, దురాగతాలు చేయించాయి. జాతులు కలుషితమయ్యాయి. స్త్రీలను అణచివేయడం, లైంగికంగా అత్యాచారాలు చెయ్యడం, కొల్లగొట్టటం, సాటి మనుషులను హింసించడం, వేరే భూభాగాలను ఆక్రమించుకొని బానిసలుగా చేసుకోడానికి మతం వీలుకలిగించింది. వాటికి సరిహద్దు గోడలు లేవు కొంతమేరకు. నిజానికి అజ్ఞానమే ఆనందదాయకం. మందలో గొర్రెలా బతికే జీవులలో ఘర్షణకు తావు స్వల్పం. భద్రతకు భద్రతుంటుంది. మత పెత్తందార్లను ప్రశ్నించవు – అవే ఆహారంగా కూడా ఉపయోగపడతాయి; ప్రతి పశువూ, జీవి ఆహారంగా ఉపయోగించుకోబడినాయి. ఏ మతంలోనైనా అధిక ప్రశ్నలు వేస్తే సమాధానం దొరకదు. మత పెత్తందారీతనాన్ని ప్రశ్నించే వీలు అంతంతమాత్రం ఒకటిరెండు మతాలలో. ఒకటిమాత్రం కటికనిజం. పుట్టటానికి, జీవించడానికి, తినడానికి, మైథున క్రియకు, కనడానికి, రోగంతో తీసుకోడానికి, చావడానికి మతం ఏవిధంగానూ ఉపయోగపడదు. పైన పేర్కొన్నఆ నాలుగు అంశాల రహస్యాలు తెలియడం మనకు ఉపయోగపడేది కూడా కాదు. వాటిని తెలుకునే ప్రయత్నం చెయ్యడానికి మనకు మేధస్సు ఉంటె చాలు, మతం సాధనంగా అక్కరలేదు. కానీ జనం నలుగురితో నారాయణ అనాలనుకుంటారు కనుక మతాన్ని ఆశ్రయించి జీవిస్తుంటారు. సృష్టి తన నిగూఢతను ఛేదించమని సవాలు చేస్తుంటుంది; తెలియని వాటిని తెలుసుకోడం అసాధ్యం అనితెలిసినా తెలుసుకోవాలనే దురద మనిషిని ఊరుకోనీయదు. గోక్కుంటుంటాడు తామర పట్టిన నడుమును గోక్కున్నట్టు. కొత్త మతాన్ని స్థాపిద్దామన్న వాంఛ నాకు లేదు. అన్ని రకాల వాంఛలకూ నేను వ్యతిరేకిని కనుక. అలాని ఏ వాంఛకు మీరు లొంగిపోరా అని నిలదీస్తే 'పోను' అని నేను అబద్ధం ఆడను. నా ఉపన్యాసం మీలో అపనమ్మకాన్ని, విచ్చలవిడితనాన్ని ప్రోత్సాహించకూడదు. ఒకవేళ దానికి అది దారితీసినా నేను అసహాయుడిని. మీ మీద ప్రభావం చూపడానికి నా ద్వారా పనిచేసే మానవాతీతశక్తి లేదు. ఎవరికి వాళ్ళు విజ్ఞతతో వ్యవహరించడం నేర్చుకోవాలి స్వీయ, మానవ కళ్యాణాలకై. ఎవరిదారిని వాళ్ళు వెదుక్కోండి అని ఒక తత్త్వవేత్త తన జీవితాంతం చెప్పి ఉన్నారు. ఐనా జనం వినలేదు.

లౌకిక జీవితం మాత్రమే ప్రాతిపదికగా, దేవుడి పాత్రలేకుండా ఒక పదకొండు అంశాల నియమావళిని నేను మీ ముందు ఉంచదలిచాను. జీవితం కనాకష్టంగా ఉండకుండా ఉండటానికి ఆ నియమావళి తోడ్పడుతుందని నా దురాశ. నియమావళిని నేను ఏర్పరచగలనే కానీ మీరు దానికి కట్టుబడి ఉండేట్లు నేను చెయ్యలేను. నిజానికి ఆ నియమాలు నా పుర్రె సొంతం కాదు. స్వర్గానికి నిచ్చెనవేశా, మీరు ఎక్కడమే తరువాయి అని మభ్యపెట్టే మతంలో భాగం కాదు నా ప్రయత్నం. మీరు దాన్ని పాటించగలిగితేపాటించవచ్చు లేదంటే గాలిపాలు చెయ్యవచ్చు.

1. పరాయి స్త్రీ, పురుషుడు, ముఖ్యంగా పిల్లల మీద కన్నెయ్యకుము.

2. సాటిమనిషికి సాయం చేయగలిగినా చేయలేకపోయినా, కనీసం కన్నీళ్లు తుడువుము.

3. కోర్కెలు నిరంతరం పెట్టె పిల్లల్ని, వేసే పిలకల్ని నిర్దాక్షిణ్యంగా నిరంతరం నిర్మూలించి పనిలో ఉండుము.

4. నీవు నీకై వెలిగించుకొన్నదీపం వెలుతురును ఇతరులనూ వినియోగించుకోనిమ్ము.

5. డబ్బు గురించీ అడ్డమైన గడ్డినికాక సరైన దానిని కరువుము.

6. ఏ పని తలపెట్టినా, దానివలన ఇతరులకు ఏమైనా ఇబ్బందుంటుందా అన్న ప్రశ్న తప్పనిసరిగా వేసుకొనుము; ఉంటే ఆ పని మానుకునే ప్రయత్నం చేయుము.

7.  నీ లోపాలను సరిదిద్దుకోలేకపోయినా, కనీసం వాటిని  చీల్చి చెండాడుకొనుము.

8. ఎదుటివాడి కష్టం చూసి సంతోషపడకుము.

9, ఎవరూ ఇమ్మని అడగని నీ తీర్పును ఏ విషయంలోనూ ఇవ్వకుము; ఇవ్వక తప్పనపుడు నత్తవేగంతో  తాపీగా ఇవ్వుము.

10. నీ ఆకలిని తీర్చుకుంటూ ఆనందించడానికి సాటి జీవిని చంపేటపుడు/చంపించేటపుడు/ఇతరులు చంపేటపుడు సాధ్యమయినంత కారుణ్యమును, గౌరవమును ప్రదర్శించుము/ప్రదర్శించేట్లు చూడుము.

11. ఇరుగుపొరుగులను ప్రేమించడం అసాధ్యం కనుక కనీసం ద్వేషించకుము.

ఆ పదునొక్కండూ ఆంక్షలు (Commandments) కావు,  ఆకాంక్షలు (Expectations).

11. అనంతత్వం

ఎన్నాళ్ళనుంచో  ఉన్న ఆసక్తి, ఒక పని అతన్ని ఈ శ్రమం దగ్గిరికితెచ్చింది.

ఇదో లోకంలా ఉంది.  మాయాబజారులా (మాయను అమ్మే బజారులా) అనిపించింది.  భద్రత మధ్యుంటుందీ ఆశ్రమం అనుకున్నాడు. ఉన్న భద్రతను సంవత్సరానికొకసారి స్వామీ సడలిస్తారు. అన్ని ఆశ్రమాలలా  తన ఆశ్రమాన్ని నడపదలచలేదు అయన. ఆశ్రమంగురించీ, ఆయన గురించీ చిలవలూ పలవలూ ప్రచారంలో ఉన్నాయి.  వాస్తవానికవి కడుదూరం. ఆశ్రమాలు, స్వాములు స్టీరియోటైపులుగా మారాయి. మరోలా ఉంటె ముందు వాటిచుట్టూ తిరిగే భక్తజనానికి నచ్చదు. వేగులు కానీ వేగులు ఇద్దరు ముగ్గురున్నారు స్వామికి  అవసరమైన సమాచార సేకరణకు. అలా అని ప్రతివిషయం గురించీ అతనిలో ఆసక్తిలేదు. అతనిది ఆధ్యాత్మిక లక్ష్యమేనా?

సాలభంజికలు లేవు కానీ భోజరాజు సింహాసనానికున్నన్ని మెట్లున్నాయి; స్వర్గానికో నరకానికో వేసినట్టుగా కూడా ఉన్నాయి – ముఖద్వారం ముందు. న్యాయస్థానం మెట్లలానూ తోచాయి అతనికి ఎంచేతనో. ఆ మెట్లు స్వామి ఎక్కడూ, దిగడూ.  వేరే మనుషులు ఆ పనులు చేయడం గురించీ అవి కళాత్మకంగా నిర్మించబడినాయి.

ఎవరో తన మెడకు విడిపించుకోలేని ఉచ్చు బిగించి, దాని పొడవాటి తాడు చివరను పట్టుకుని పశువును లాక్కుపోతున్నట్టు గాను, వధ్యశిల అతనిని అయస్కాంతంలా ఆకర్షిస్తున్నట్టుగాను, మెదడు పుచ్చినట్టు అయోమయంగాను వెళ్ళిపోతున్నాడు పైకి.

ఎంతగా భద్రతను సడలించినా భద్రతా సిబ్బంది ఏమీ పట్టనట్టు తారాడుతూ తమ డేగకళ్లకు పని అప్పగించే ఉంచారు. స్వామి కదా అని, ఆశ్రమం కదా అని దొంగలు తమ కార్యాన్ని మానుకోరు. దొంగలు కాని వారు కూడా తమ చేతులను దేన్నీ ముట్టుకోనీయకుండా అదుపులో ఉంచుకోలేరు. సీసీ కెమెరాలున్నాయి నిఘానేత్రాలలా.

ఎవరూ అడ్డగించకపోవడం వలన ఎంతవరకూ వీలయితే అంతగా లోపలి వెళ్లదలచుకున్నాడు. విచిత్రమైన విషయం తాను తప్ప ఇంకెవరూ అంత స్వేచ్ఛగా, కుతూహలంతో గడప తరువాత గడప దాటుతూ వెళ్లడంలేదు. తన గురించే ఆశ్రమం నిరాటంకంగా తెరువబడుందా? నిద్రలో నడిచే అలవాటు ఉన్నవాడిలా మత్తుగా, అనాలోచితంగా, హిప్నోటైజ్ చేసినట్లు తన  ముక్కే దిక్సూచిగా వెళుతున్నాడు. అమాయకంగా,  వధ్యశాల వైపు నడుస్తున్న పశువులా అడుగులు వేస్తున్నాడు. మోహంతో గాలాన్ని ముద్దు పెట్టుకోబోతున్న అమాయకపు చేపలా వెళుతున్నాడు. అత్యంత అందమైన తలుపు మూసి ఉంది. అలా అని అది ఆడంబరంగా లేదు. ఒంటి మీద ముక్కుపుడక, కనీసం నూలుపోగంత వస్త్రం లేని అందమైన స్త్రీ సొగసు దానికుంది. దాన్ని నిమరాలనిపించడమేకాక కౌగలించుకోవాలనిపించేట్లుంది. మొదటిసారి అతను తమకంతో కౌగిలించుకున్న స్త్రీ శరీరం గుర్తుకొచ్చింది. నవ్వాలనిపించ లేదు; ఆ జ్ఞాపకం ఎందుకో భయపెట్టింది. అతను చేయి వేయబోతుండగా అలా వేయించుకోడం ఇష్టంలేనట్టు, మర్యాద తెలిసినట్టు, తలుపు నిశబ్దరహితంగా పక్కకు జరిగింది – 'అల్లా కా హుకుం, ఆబూ కా సలాం తెరుచుకో సెసేమ్'  అనికూడా అనకుండా. ఆశ్రమంలోనే కాక, ఆశ్రమానికి తరచూ వచ్చే భక్తులకూ అలాంటి చిన్న విషయాలు తెలుసు. నిజానికి అది పెద్ద విషయమే. చిన్నదనుకున్నా, అది గుడ్డంత పలచనిది. దేవలోకం నుంచీ దిగుమతి చేసుకున్న పలుచని, పగలని  చెక్కో, ఉక్కురేకో. ఆ అతి విశాలమైన హాలు తొడలు తెరిచి పరుచుకునుంది. అవతలి చివర మధ్యగా మూసినా దివ్య అంగంలాంటి వెడల్పు తక్కువ తలుపు. తలుపుకు చేరువగా వణికే కాళ్ళ అడుగులు పడుతున్నాయి; అంతర్వాణి ముందుకు రాకు పారిపో అని హెచ్చరిస్తున్నట్లుంది. అశక్తుడ్ని అని తనకు తాను సమాధానం చెప్పుకుని ముందుకెళ్లి; తలుపు దానంతట అది తెరుచుకుంటుందని అనుకున్నాడు. అలా జరగకపోవడం వల్ల కసిగా బలమంతా ఉపయోగించి తోశాడు.

గుండ్రటి గది. గదంతా అరేబియా నుంచీ దిగుమతి చేసుకున్న సుగంధం ఆక్రమించున్నది. మీగడతో అల్లినట్టున్నకేవలం ఒక దివాను గది సగానికి ఆక్రమించున్నది, అవతలి గోడనానుకుని. అలాంటి గదినెప్పుడూ చూడలేదు. దాన్ని చూసి అబ్బురపడే అవకాశం దానిలోని ఇద్దరు మనుషులు ఇవ్వలేదు.

దానిమీద చెదిరిన పంచ, చిందరవందరగా ఉన్న జుట్టుతో, పశువాంఛ కమ్ముకున్న స్వామి, ఆయన ఒళ్ళో రవివర్మ వేసిన తిలోత్తమ లాంటి స్త్రీ. ఆగంతకుడికి  వాళ్ళిద్దర్నీ చూడగానే ముచ్చెమటలు పోశాయి. దృశ్యం

విద్యుదాఘాతంలా తగిలింది. కళ్ళు మోసంచేస్తున్నట్లనిపించింది. కనురెప్పలు నీలుక్కుపోయి వాల్చలేకపోయాడు. ఆ దృశ్యం అతని కనుగుడ్ల ఉపరితలం నుంచీ లోపలిగా ముచ్చెనగుంట దాకా మందంగా ఆక్రమించింది. గది గవాక్షాలలోనుంచి కూడా ఏ చప్పుడు వినబడలేదు. శబ్దం శాశ్వతంగా నిష్క్రమించినట్టుంది. గుండె చప్పుడు తన చెవులకు వినబడుతున్నట్టనిపించింది. అతను వినగలుగుతున్న శబ్దం అదొక్కటే; నేలవాలిపోతున్నట్టనిపించి నిలదొక్కుకున్నాడు.

స్త్రీ స్పృహ తప్పి దొర్లిపోయింది తన శరీర నగ్నత్వాన్ని తానే మరిచిపోయి. స్వామి చాకులా లేచి నిలబడ్డాడు, ఒక యుగపు పగ దాని ఇంధనంలా.

"సింహపు బోనులోకి చిట్టెలుక వెదుక్కుంటూ వచ్చింది. చిట్టెలుకను పంజాతో పట్టుకుని పిసికి చంపాలా, కిటికీలోనుంచీ విసిరివేయాలా? ఎవడివి నువ్వు? ఇంత లోపలికి చొచ్చుకు రావడంలో అనవసరంగా అతి సాహసం చేశావు," అన్నాడు స్వామి.

స్వామి చేతిలో పిస్తోలుంది; అది వచ్చిన వ్యక్తిని లక్ష్యంగా చేసుకుంది దానికి అతను ఏ అపకారం చెయ్యకపోయినా. పిస్తోలు దగాచేస్తుందేమోనన్న అనుమానమున్నట్టు గోడకు వేలాడుతున్న తళతళ మెరిసే రెండున్నర అడుగుల పొడవు, అంగుళం వెడల్పూ ఉన్న కత్తిని ఎడమచేతితో తీసి దాన్నీ ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నాడు. స్వామి కళ్ళు చింత నిప్పులయ్యాయి. మానం సంగతి స్వామికి గుర్తుకొచ్చి పంచను సరిచేసుకున్నాడు, కిందికి వొంగి కత్తిని కిందపెట్టుకుని. ఆగంతకుడి నోట మాటలేదు స్వరపేటిక పేలిపోయినట్టు. ఒణికిపోయాడు ఆగంతకుడు సన్నిపాత జ్వరం ఉన్నట్టుండి సోకినట్టు. కింద పడి దొర్లాడు మైకంలో ఉన్న స్త్రీ మీది నుంచీ దృష్టి మళ్లించి, స్వామి మొహంలోకి వెదుకుతున్నట్లు చూసి రెప్పలు దించేశాడు. స్వామి కళ్ళలోని తీక్షణత దగ్ధంచేస్తున్నట్టనిపించి వెనక్కు పారిపోదాం అనుకున్నాడు. స్వామీ, అతనిచేతిలోని పిస్తోలు అన్ని క్షణాల వ్యవధి ఇవ్వరని గ్రహించాడు మృత్యుముఖంలో కూడా. నేలమీద చతికిలపడ్డాడు. మూర్ఛ రాదుకదా అనిపించింది. వచ్చినా మంచిదేకదా అన్న ఆలోచన మెదిలింది. ఉన్నట్టుండి మరణినిస్తే బాగుండు అనిపించింది. మరణం పిలిస్తే రాదు; వచ్చినపుడు పొమ్మంటే పోదు. అదొక నియంత. ఏమో పిస్తోలు పేలితే ఒక ఇనుపగుండు తన గుండెలోకి దూరి ప్రాణాన్ని బైటికి నెట్టెయ్యవచ్చు. చావు తప్పనపుడు చావుకు భయపడటం అవివేకం అవుతుంది. కుమ్మ బోతున్న ఆంబోతు కొమ్ములకు చేతులు అడ్డుపెట్టక తప్పదు; విసిరిన పంజాను చేత్తో పెట్టుకోక తప్పదు; అదొక అసంకల్పిత ప్రతీకార చర్య.

"తప్పయిపోయింది, స్వామీ. తెలియక చేశాను."

"నిప్పని తెలియక పట్టుకుంటే నిప్పు చేసేది మానుతుందా?"

"మీరన్నది నిప్పులాంటి నిజం."

"నేనన్నదానికి తందానా అన్నా జరగాలిసింది జరిగి తీరుతుంది."

"ఆ విషయం తెలియదు, స్వామీ."

"నీవు ఏ శిక్షకు అర్హుడివి?"

"ఉరికి," తెగింపు తెచ్చుకుని స్వామి మొహంలోకి సూటిగా చూస్తూ అన్నాడు.

"నా దగ్గిర ఉరితాడు లేదు, పిస్తోలు ఉంది. రష్యాది.

"ఉరికన్నా పిస్తోలు గుండు నయం."

"చచ్చేటప్పుడు కూడా కోర్కె చావదు."

"మీ ఉపన్యాసాలని మా కామాక్షి పొల్లుపోకుండా చెబుతుంటుంది."

"ఉపన్యాసాలు కాదు, ప్రవచనాలు."

"ఏ రాయయితేనేమి మౌఢ్యాన్ని పెంచడానికి?"

"తెగించినట్టున్నావు, మరో మార్గం లేక. పారిపోయే వీలులేని మార్జాలం తెగిస్తది."

"ఇందాక నన్ను ఎలుకతో పోల్చిన జ్ఞాపకం."

"చచ్చే జీవి జాతి ఏదైతేనేమి? జీవులన్నిటిదీ ఒకే విలువ."

"అలాంటప్పుడు నన్ను చుంచెలుకతో పోల్చనక్కరలేదు."

“అది నా ఇష్టం."

“చుంచెలుకలను చంపడానికి ఒక అందమైన కత్తి, రషియా పిస్తోలు అవసరమంటారా?"

"మాయల చుంచెలుక పారిపోకుండా చూడటానికి, చంపడానికి ఒకటి సరిపోదు. ఈ రెండింటినీ ఒకేసారి ఉపయోగించడం ఆరునెలలపాటు సాధనచేశాను. ఉపయోగించే అవసరం ఇంతవరకూ రాలేదు. నీవు దానిని తెచ్చావు."

వెర్రిగా, దేముడిలా కేకేశాడు. ప్రాణం ఎంత విలువైనదో మొదటిసారిగా అతనికి తెలిసింది. అంత విలువైన ప్రాణాన్ని కనురెప్పవేసినంత తేలికగా దేవుడు ఎలా తీసెయ్యగలిగాడో! ఇక్కడ తనను ఎవరు రక్షించగలరు? ఏమన్నా రక్షించగలిగితే (స్త్రీ హృదయం నవనీతం గనుక) స్మారకం వస్తే ఆ అపస్మారకంలోని స్త్రీ అడ్డుపడాలి. పైగా స్వామి అతిగా కామించినట్టు అనిపిస్తోంది కనుక ఆమె మాటను కాదనకపోవచ్చు స్వామి. చంపద్దని స్వామి కామించిన స్త్రీ చెబితే వినకపోడు. ఒకసారి ఏడ్చి చూస్తే, ఏ మాత్రం మానవత్వం ఉన్నా స్వామి "పో" అంటాడేమోనని అనిపించింది. ఏడుపుకు పూనుకున్నాడు.

"ఆడంగిరేకుల వెధవ. చిత్తకార్తెలో అర్థరాత్రి జంటకై ఏడ్చే కుక్కలా దీనంగా అరుస్తున్నావు. నీ ఏడుపు నీకు సిగ్గుకలిగించడం లేదా? అతిగా ఏడుస్తున్నావని నాకు అర్థమవుతోంది."

"మీ ప్రాణం మీదికి వచ్చిన క్షణాల్లో మీరు సిగ్గో ఎగ్గో పడుతూ ఊరుకుంటారా?"

"నీతో నన్ను పోల్చి నన్ను అవమానించావంటే బతకబోయే కొద్దినిముషాలలో కొన్ని తగ్గుతాయి."

ఇద్దరు రక్షకభటులు వచ్చి ఆగంతుకుడు వెనక నిలబడ్డారు.

"ఇంతసేపూ ఎక్కడ గంజాయి కొడుతూ కూర్చున్నార్రా, చవాలాయి వెధవల్లారా," అన్నాడు స్వామి ఆగంతకుడి భుజం పై నుంచీ చూస్తూ.

వాళ్ళు తలలువంచి, నడుం వంచి విధేయతను చాటుకుంటూ ఏమీ మాట్లాడలేదు. వెనక్కు తిరగడానికి భయం వేసి ఆగంతకుడు స్వామీ వైపే చూస్తున్నాడు.

"ఆ హాలు తలుపు మూసి కాపలావుండండి పిలిస్తే పలికే వీలుగా. ఈ నక్క పారిపోయే ప్రయత్నం చెయ్యవచ్చు."

వాళ్ళు వెళ్లిపోయారు.

"ప్రస్తుతం నాది నక్క అవతారామనుకుంటాను," తెగించి అన్నాడా వ్యక్తి.

మహా అయితే ఈ స్వామి కానీ స్వామి చంపుతాడు, భయపడినా భయపడకపోయినా. ఒక రహస్యాన్ని తన రెండు నేత్రాలతో చూశాడు. అలాంటి వ్యక్తి బతికి ఉండటం స్వామికైనా, స్వామికానివాడికైనా క్షేమదాయకం కాదు. భగవంతుడి మీద భారంవేశాడు. లేకపోతె భగవంతుడిని సృష్టించుకోడం అవసరం అని పెద్దలు ఊరికే అనలేదు.

“మీరు చేస్తున్న పరమ పాతకపు పనిని నా కళ్ళతోచూడటమేనా నేను చేసిన పాపం? దాని వలన నాకు జరిగిన నష్టం మీకు పట్టదా? నన్నుపోనీయండి. నేను మీరు చేసిన పనిని ఎవరికీ చెప్పుకునే వీలూ లేదుకదా? మరో విషయం పక్కనుంచి, మీ భక్తులు నమ్మరు సరికదా ఈ విషయం చెబితే నన్ను రాళ్లతో కొట్టి చంపుతారు. రాళ్లకు ఖర్చవ్వదు. పిచ్చికి భక్తి పర్యాయపదం అయింది ఈ దేశంలో!"

"బ్లాస్ఫేమీకి (blaspheme) పాల్పడ్డావన్న విషయం నీవు గ్రహించినట్టులేదు. నీవు చేసిన మహాపాతకాలు, నేరాలు ఏవో నీకు తెలీదా? కేవలం నువ్వు నీ కంటితో చూసిన దాన్ని పదిమందికీ చెబుతావన్న భయంతో నిన్ను నిలవరిస్తున్నావని భావించకు. చిన్ని నా బొజ్జకు శ్రీ రామ రక్షా అనుకునే నీ సంకుచిత మనస్తత్వం వ్యాకోచించి దేశం గురించి సమాజం గురించీ మాట్లాడుతున్నావు. మంచి పరిణామమే. కానీ నీ చావు ముందు అలాంటి పరిణామం వల్ల ఒరిగే మేలు నీకు కానీ ఇతరులకు కానీ లేదు."

"మీ మాటలు వింటుంటే మనిద్దరికీ జన్మజన్మల బంధం కొనసాగుతున్నట్టు, నా ప్రతి చర్యనూ చిత్రగుప్తుడి చిట్టాలాంటి దాంట్లో ఎక్కిస్తున్నట్టు మాట్లాడుతున్నారే? కనీసం పది జన్మల క్రింది వరకూ మీరెవరో నేనెరుగను. నేను మిమ్మల్ని ఎరగనపుడు, మీరు నన్ను ఎలా ఎరుగుదురు?"

"నేను త్రికాలజ్ఞుడిని, నీవు నీ కళ్ల ముందు ఏమి జరుగుతోందో కూడా ఎరుగని మూర్ఖుడివి. నాతో నీకు పోలికేంటి?"

"మనిద్దరికీ పోలికలు లేవా? ఇద్దరం శారీరకంగా మనిషి లక్షణాలతో ఉన్నవాళ్ళమే కదా. అలా కాకుండా ఉండుంటే ఆమెతో మీరు ఆ పని చేసుండేవారు కాదు కదా?"

"నువ్వు వాదించి బతికి బట్టకడదామనుకుందామనే ఉద్దేశంలో ఉన్నట్టున్నావు. నీ చావు తథ్యం."

"పుట్టిన ప్రతి వ్యక్తికీ మరణం తథ్యం. నా నేరాలూ, తప్పులూ ఎన్నడానికి తమరెవరు?"

"ఎప్పుడో కాదు నీవు చచ్చేది; కొన్ని క్షణాలలో. నేనెవరైనా? ఒక స్వామిననుకో. స్వాములకు ప్రత్యేక హక్కులు, బాధ్యతలు ఉంటాయి. లోకంలో నేరప్రవృత్తి, పాపిష్ఠితనమూ పేట్రేగిపోకుండా చూసే బాధ్యత ప్రతి నిజమైన సన్యాసికీ ఉంది."

"సన్యాసి ఇలా వ్యభిచారంలోకి దించడం, వ్యభిచరించడం ఒక హక్కా? బాధ్యతా?  ధర్మం లేక న్యాయసమ్మతం అని ఏ న్యాయ శాస్త్రంలో లేక ధర్మ శాస్త్రంలో ఉందీ?"

"ఎవరి కర్మకో ఫలితాన్ని ఒసగడంలో మాధ్యమంగా వ్యక్తులానో, శక్తులానో వాడుకోడం అతి సాధారణ విషయం. అలా నన్ను ఉపయోగించుకుంటుండొచ్చు."

"హత్యలకు కూడా పాల్పడి న్యాయమూర్తికి కూడా మీ ఈ వాదనను వినిపించవచ్చు."

"ధర్మ సూక్ష్మాలు వ్యాస, భీష్ములనే తికమకపెట్టాయి; గొట్టంగాడివి నువ్వెంత?"

"మీది స్వాములు మాట్లాడవలసిన భాష అని నాకు అనిపించడంలేదు."

"స్వామైనా, సన్నాసయినా గాడిదను గాడిద అని, గొట్టం గాడిని గొట్టాంగాడు అని మాత్రమే అనాలి కానీ – గాడిదను కుక్క అనో మరొకదాన్ని మరొకటనో అనలేరు. నీకు నా భాష గురించీ, చర్యల గురించీ సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన అగత్యం నాకు లేదు. పిచ్చిగా వాగితే పిస్టోలో, ఖడ్గమో దాని పని అది చేసుకు పోతుంది, నన్ను ఏవిధంగానూ కష్టపెట్టకుండా."

"మీరు మీ ఘాతుకపు చర్యలను, భాషాజాలాన్ని సమర్థించుకోడానికి ఎన్ని పాట్లన్నా పడండికానీ, మీరు నా పట్ల ప్రవర్తిస్తున్న తీరు పేర్లు మాత్రం జబర్దస్తీ, గూండాగిరి అని సవినయంగా మనవిచేసుకుంటున్నా."

"రాయుడి పట్ల నీవు ప్రదర్శించింది ఏమిటో, అప్పటి ధైర్యం ఇప్పుడు  ఎందుకు కొరవడిందో తిరుమలేశుడికే తెలియాలి. పోతే నీది అరణ్యరోదన. నా ఆశ్రయం అరణ్యం కాకపోవచ్చు. నీది రోదనే. నీ గుండె, కళ్ళూ కరిగి నీరవడమే నీకు మిగిలేది. నా గది దివాను తడిసి పాడైనా ఫర్లేదు. ఒకవేళ ఇంకా నీవు మిగిలుంటే కత్తికో, పిస్తోలుకో ఎరవుతావు."

రాయుడి బంధువా, కులస్థుడా ఈ దాదా అని ఒక నిమిషంపాటు ఆలోచనలోపడి వెంటనే తేరుకున్నాడు.

"నా మీద ఎందుకీ పగ? మిమ్మల్ని నా ఏ పీడకలలో ఎప్పుడూ చూసిన గుర్తుకూడా లేదు. పాపాలు చేసిన జీవులను విచారించి శిక్షలు నిర్ధారించే యమధర్మరాజుగా మిమ్మల్ని మీరు నియమించుకున్నట్టున్నారు. వ్యక్తిగతమైన కక్షా కార్పణ్యమూ ఉంటే ఏ బాక్సింగ్ రింగులోకో దిగి తేల్చుకుందాము."

"నాకు బాక్సింగ్ చేయడం రాదు. ఈ విద్యే ఆర్నెల్లు సాధనచేశా. నీకు ఈ విద్య తెలియదని నాకు వచ్చిన విద్యను ప్రయోగించడం మానను. నీ పాపాల చిట్టా మొత్తం నా దగ్గిరుంది. నీకు ఒక వరం ఇవ్వదలచాను. యమధర్మరాజు

అన్యాయంగా ప్రవర్తించదు. ఆయన పాపం చేస్తే ఆయనకు శిక్ష విధించే దేముడు మరొకడుంటాడు. శిక్షంటే అందరికీ భయమే; అలా అని శిక్షార్హమైన పనులను చెయ్యడం మాత్రం మానరు."

"మీ ఈ చర్య న్యాయాన్యాయాలను సరిశీలించే వ్యవస్థ మీద ఆధారపడుందా?"

"ఉంటే ఉండొచ్చు, లేకపోతె లేకపోవచ్చు. నిన్ను శిక్షించడం నా ప్రస్తుత కర్తవ్యం, ధర్మం. స్వాములు భోగాలు అనుభవించడానికి మాత్రమే ఉన్నారని నీలాంటి తుచ్ఛులనుకుంటారు. వాళ్లకూ గురుతర బాధ్యతలుంటాయి. అలాంటి ఒక దాన్ని నేను నిర్వర్తిస్తున్నాను."

"ఈ ఊరిలో నేనొక్కడినే పాపాత్ముడినా? మిగతావాళ్ళందరినీ వదిలేసి నన్ను ఎంపికచేసుకోడానికి కారణం?"

"ఓపికపడితే నీకు తప్పక తెలుస్తుంది. ఓపికపట్టడం వలన కోల్పోయేదేముండదు ఓ దుగ్గానీ విలువలేని ఓపిక తప్ప. ఓపిక పడితే లాభాలు ఉండకపోవు. వెంట్రుకను కట్టి కొండను లాగాడట నీలాంటి వాడు, ఒకవేళ పొతే వెంట్రుకే పోతుంది, వచ్చిందా కొండొస్తుందని – ఉన్మాదానికో, దురాశకో పరాకాష్ఠ. నాతో నీ ఇష్టమైన విధంగా వాదిస్తున్నావు; నిలదీసే ప్రయత్నమూ చేస్తున్నావు. చావు తెలివితేటల్లా చావు ధైర్యం కూడా ఉంటుంది."

"చావు ముందు వచ్చేది మరొకటుంది. దాని పేరు వైరాగ్యం. వైరాగ్యం భయాన్ని పోగొడుతుంది."

"నీవు అదృష్టవంతుడివిరా. నీకు ఆందమేకాక తెలివితేటలూ ఉన్నాయి."

"చావబోయేవాడు గౌరవానికీ అనర్హుడంటారా – 'రా' కొడుతున్నారు?"

"నీకు సెంటిమెంట్లూ, సున్నితత్వం, సంస్కారం, మంచితనం, ఆత్మగౌరవంలాంటివి ఉన్నాయా?"

"లేవన్న తుది నిర్ణయానికి వచ్చినట్టున్నారు."

"నీ తల్లి పుస్తెలమ్మినప్పుడు ఆత్మ గౌరవం, సెంటిమెంటు, సున్నితత్వం వగైరాలు ఏమైనాయి?"

అనంతం కంగుతిన్నాడు. వీడు మహిమగల స్వామా కొంపదీసి అనుకున్నాడు. కాళ్ళు వణికాయి.

"గోడకు జారబడ వచ్చునాండి?"

"నీ తలనూనె మరక అంటుకుంటే ఒప్పుకోను."

జారగిలబడి తల ఒంచుకున్నాడు.

ఆ పుస్తెల గురించీ చనిపోయిన తల్లికి, దాన్ని కొన్న ఆ అప్రాచ్యుడికి మాత్రమే తెలుసు. ఆ షరాబు బంధువా వీడు? ఆ సమయంలో అక్కడ కూర్చుని గుడ్లగూబలా వీడు అంతా పరికించి ఇన్నేళ్లు గుర్తుపెట్టుకొన్నాడా? అసంభవం. వీడిలో ఏదో మానవాతీత శక్తున్నది. ఇంద్రజాల వాస్తవికత (magical realism) అని ఒక పోకడ చాలాకాలంగా సాహిత్యంలో ఉందని ఎవరో అనుకుంటుండగా విన్నాడు. అభూతకల్పనతో వాస్తవజీవితాన్ని మిళితంచేసి రాసేది. జీవితంలో కూడా ఆ బాపతుందా లేక నిజంగానే మానవాతీత శక్తి కారణంగా ఈ యములాడు తనను పట్టి పీడిస్తున్నాడా? అతీంద్రియ శక్తులున్నాయని వామపక్షవాదే వాకృచ్చాడు.

"నీ మనసులో ఏం ఏడుస్తున్నావో నాకు తెలుస్తూనే ఉంది. నాకు నీ అంతరంగ విషయాలు ఎలా తెలుసునా అన్న విషయం పక్కకునెట్టేసి నాకు కావలసిన సమాధానాలు ఇవ్వు. నా సమయం వృథా చేస్తే నిన్ను చిత్రహింసలపాలు చేస్తాను. చచ్చేదేదో సుఖంగా చావడం విజ్ఞత అనిపించుకుంటుంది."

"సమాధానాలు కూడా మీకు తెలిసే ఉండాలిగా?"

"నీ చేత చెప్పించాలని; శంఖులో పోస్తే గాని తీర్థం కాదు. పైగా నిందితుడి మనసులోని విషయాలు న్యాయమూర్తి పసిగట్టినా నిందితుడి నోటా వినక తప్పదు."

"నాకు అప్పుడున్న ప్రత్యామ్నాయాలు ఆకలి, అవసరాలతో వధించబడడం లేక అడుక్కోడం. భిక్షాటనకు వెళితే నన్నూ నా అందాన్నీ చూసి నన్ను తంతారుకాని భిక్షం వేయరు; దున్నలా ఉన్నావు ఎక్కడన్నా పనీ పాటా చేసుకోవచ్చుగా అంటారు. మూడవది పుస్తెలు అమ్మి జీవితంలో నిలదొక్కుకోడానికి వచ్చిన కాస్త ధానాన్నీ పెట్టుబడిగా ఉపయోగించుకోడమూ. మా అమ్మ దుర్భర పరిస్థితులు దాపురించిన దినాలలోనూ ఆ కొంచెం బంగారం అమ్మదలచుకోలేదు. ఈ నలుసంత బంగారమన్నా నీకు ఒదిలిపోక పొతే నేను నీకు వందశాతం ద్రోహం చేసి పోయినదానినవుతాను అనేది. నేను పెద్దగా పట్టించుకోలేదు. సెంటిమెంటు ఆకలి తీర్చదు, బట్టను మనకు కట్టదు. పుస్తెలమ్మడం వలన మా అమ్మతో సహా ఎవరికీ కష్టం లేక నష్టం లేవు. మా అమ్మ వారసుడిగా అవి నావి, వేరే ఎవరివో కాదు. మరోఆధారం దొరికితే వాటిని ముట్టుకునే వాడిని కాదు. అదేదో పెద్ద తప్పిదంలా ఒక అభియోగం తెచ్చారు. మీ తెలివితేటలను సూచించే విషయం కాదది, అగ్నిపుత్ర స్వామి."

"అమ్ముకుంటే అమ్ముకున్నావు; ఆవేదనన్నా నీలో కలిగిందా? అలా కలగడానికి ఖర్చేమీ కాదె, కలిగే నష్టమూ లేదే? నీవు మనిషివె కానీ మరవు కాదని నీకు నీవు చెప్పుకోడం (నీలో అంతరాత్మకు చోటుంటే) అవసరం కదూ?"

"ఒక్కో మనిషి ఏడుపులు ఒక్కోలా ఉంటాయి. ఆ సందర్భంలో మీకు ఏడవాలనిపించవచ్చు; నాకు అనిపించలేదు, ఏడుపు దానంతట అది రాలేదు. ఒచ్చి ఉంటె మీ తనివిదీరా నేను ఇప్పటిలా నేల మీద పొర్లి ఏడిచివుండేవాడిని."

"నీవు ఒక జంతువుగా మారావు, అందువల్ల మానవ సహజమైన భావోద్రేకాలు నీలో సన్నగిల్లాయి అని నేను అంటాను."

"జంతువుకూ భావోద్రేకాలుంటాయి. మనిషిలో ఉండేలాంటివి కాకపోవచ్చు; అవనూ వచ్చు. జంతువులో ఉండవు అని మీకు ఎలా తెలుసు? మీరు జంతుజన్మ ఎత్తినప్పుడు తెలిసి ఈ జన్మలోనూ అవి జ్ఞాపకమున్నాయా? జాతక కథల లాంటివి రాయండి ప్రపంచ సాహిత్యానికి, ఆధ్యాత్మికతకు సేవచేసినవారవడమే కాక, మీ పేరు స్థిరస్థాయిగా నిలబడి ఉంటుంది. మనిషిగా కాక జంతువుగా నేను ప్రయత్నపూర్వకంగా మారలేదు."

"నీవు అనవసర వాదనకు దిగుతున్నావు; నాకు బోధించే ప్రయత్నం చేస్తున్నావు; ప్రమాదకరం."

(ముగింపు వచ్చే నెలలో)

COMMENTS